

## వారం వారం కథాప్రభ

**పొద్దున ఏడున్నరకు భోంచేసి బడికి పోతాడు చిన్న కొడుకు. మొదటి ముద్ద, పప్పు నెయ్యీ వేసి కలిపి దొడ్డివైపు గచ్చుమీద ఉంచుతాడు. పక్కింటి పెరటిలోని జంటమామిడి చెట్ల మీది కాకులు ఈ ఇంట్లో వాలి దాన్ని తింటాయి. ముందు ఏ కాకి ఆ ముద్దని చేరితే దానికి సింహభాగం దొరుకుతుంది. చిందరవందరయిన మిగిలిన మెతుకులను మిగతా కాకులు తింటాయి.**

ఇంటాయన కుటుంబరావు తొమ్మిది గంటలకు ఫలహారం చేస్తాడు. అట్టు, ఇడ్లీ, గోధుమరొట్టె ఏదైతే దాన్ని తుంపి ఇంటికి దక్షిణం వైపు గచ్చుమీద మూడు చోట్ల ఉంచుతాడు - తన పితరుడికి పిండాలు పెడుతున్నట్లు. అన్ని కాకులకు సమంగా చెందే వీలుగా.

"ఇది ఇల్లా? జీవకారుణ్య సమాజమా?" అని విసుక్కుంటుంది ఇల్లాలు కామేశ్వరి. కాకులు వదిలిన మెతుకులూ, పదార్థాలు ఎత్తివేసుకోటం ఒకపని. తినేపనేకాక మరొకటి చేసి పోతుంటాయవి - కృతజ్ఞత, కృతఘ్నత తెలీనివి కదా అవి.

రాత్రి అందరి భోజనాలు అయిన తర్వాత ఇంటి గేటు ముందు కుడివైపుగా అన్నం వేస్తాడు కుటుంబరావు. హాల్లో, గుమ్మానికి ఎదురుగా, వీధిలోకి కనిపించేట్లుంది గడియారం. గడియారం చూడటం వచ్చినట్లు, పావు తక్కువ ఎనిమిదికల్లా గేటు ముందు చేరి హాల్లో గడియారం కేసి చూస్తూ వేచి ఉంటుంది నల్ల గజ్జికుక్క. మనిషి అలికిడి అయినపుడల్లా చెవులూ, తోకా ఆడిస్తుంటుంది. అలా చేయకుండా ఉంటే అప్పులవాడిలా తోచి ఉండేది. దానికి విశ్వాస గుణం ఎక్కువ. ఆ వీధిలో ఎదురయ్యే పరిచితమయిన ఏ చేయినీ, కాలినీ నాకందే వదలదు. విశ్వాస పరంగా, అది కుక్కలకే కుక్క.

"ఆ గజ్జిది కాకపోతే తిండి పెట్టటానికి మరో కుక్క దొరకదా." అంటుంది. కామేశ్వరి, పైకి మాత్రం. ఆమె అన్నదానికి ఏ సమాధానం ఉందో ఆమెకీ తెలుసు. అది, భర్త అనేది, ఇది:

"మిగిలిన అన్నం పడెయ్యటానికి అందం అర్హత కాదు; కాదది ముద్దవేసే చేతికి చెల్లించవలసిన మూల్యం."

"మీతో వాదనకు దిగటానికి నాకు వ్యవధి లేదు," అని స్టోన్‌వాల్ చేస్తుంది.

ఆ కుక్కరాత్రి వదిలేసిన అన్నం మెతుకులు, తెల్లవారి ఉషోదయపు అతిథులలాంటి పిట్టలు - ఏ కుంచా కలుపలేని రంగులవి-సమీపపు కొండల మీదినించి వచ్చి ఆనందంగా తింటాయి. కుటుంబరావు సిటౌట్లో క్రింద కూర్చుని, పరిచిన



# హాబ్‌సన్స్ ఛాయిస్

## నల్లూరి వెంకటేశ్వరరావు

పేపర్లోని అవినీతి వార్తలు ఒకవైపు చదువుతూనే పిట్టలను చూపులతో పలకరిస్తుంటాడు. అతని కళ్లలో గర్వం, కృతజ్ఞత తొణికిసలాడుతుంటాయి.


యజమాని పడక గది కిటికీ ఒకటి పడమరకు అంటే రోడ్డువైపు ఉంటుంది. దాని రెక్కలు తీసే ఉంచుతారు. ఆ గదిలోకి లాఫ్ట్ ఓపెనింగ్ ఉంటుంది. ఒక ఆడ ఉడత ఆ అటక మీద కాపురం పెట్టింది. దాని రాకపోకలు ఆ కిటికీలోనించే జరుగుతాయి.

"అటక మీద గడ్డీగాదం పెడుతోంది. కిటికీ మూసి ఉంచితే దాని రోగం కుదురుతుంది." కేకలేస్తుంది కామేశ్వరి. "పోనీలే పాపం..." నీళ్లు నములుతాడు రావు. "అవును ఈ ఇంట్లో అదరివీ గుండెలు, నాది తప్పు," రుసరుసలాడుతుంది.

ఆమేదీ రాతిబండకాదు. బడికి వెళ్లే తొందరలో చంటాడు మొదటి ముద్ద కాకికి పెట్టకపోతే - "ఆ వెధవ కాకులకు తగలేశావా," అని అయిష్టమయిన పనిలా గుర్తు చేస్తుంది. కుక్కకు అన్నం వెయ్యటం మరిచిపోతే, "ఆ దరిద్రపు కుక్క రాత్రంతా గుమ్మం దగ్గరే మోర ఎత్తుకుని కూర్చుని ఉంటుంది, అన్నం వేసి రండి," పురమాయిస్తుంది. ఇంట్లో ఎవరూ లేనపుడు, ఆమెకు ఉడతమీద కోపం ఉంటే, గది కిటికీ రెక్కలు మూసి దాని రాకపోకలే అరికట్టవచ్చు. కానీ చెయ్యదు ఆ పని.

ఇంటికి ఎదురుగా ఇల్లు లేదు. ఆశ అంత విశాలమైన, చతురస్రాకారపు స్థలం ఉంది. చుట్టూ ప్రహారీ ఉంటే అది పారిపోకుండా. నిజానికి, ఆశకూ ఈ స్థలానికి ఒక తేడా ఉంది. ఆశకు అవధి ఉండదు. ఇంకా దురాశ చావని ఆ స్థలం యజమానికి డెబ్భై దాటాయి. రేపు ఆయన పోవచ్చు. ఆయన జ్ఞాపకంగా ఆయన దురాశ మిగిలి ఉంటుంది. ఆయన అమెరికా పిల్లలు అమ్మేసి సొమ్ము చేసుకుని డాలర్లుగా మార్చుకుని వెనక్కు వెళ్లకపోతే, స్థలం మిగిలి ఉంటుంది. ఆ స్థలంలో, మనిషి మనసులో బలమైన వేళ్లు తన్ని ఊడలు దించిన అర్జనాదాహం లాంటిదే మామిడి చెట్టుంది విస్తరించుకుని. ఈ పోలిక భౌతిక పరమైనది. దురాశ మనస్తాపాన్నిస్తుంది. మామిడి చెట్టు ఫలాలను ఇవ్వటమనే నిష్కామకర్మ చేస్తుంది. ఇది ఆశించేదల్లా పిట్టలు, పక్షులు తనపైవాలాలని, మనుషులతో సహా జీవరాసి తన ఫలాన్ని ఆరగించి లొట్టలు వేయాలని.

ఎదురు స్థలంలో ఒక రాత్రి పిల్లి అరుపులు వినిపించాయి. దురాశ వేసే వెర్రి తలలలాంటి ఎత్తుగా, గుబురుగా మొలిచిన పిచ్చి మొక్కలు.




వాటిలో ఏం జరుగుతుందో ఎవరికీ తెలీదు. మూడు నాలుగు రోజుల తర్వాత ప్రొద్దునే ఇంటి మెట్ల క్రింద, స్కూటరు పెట్టగా మిగిలిపోయిన ఖాళీలు నాలుగు పిల్లి పిల్లలున్నాయి. పెద్దవాడు చూశాడు. చంటాడిని పిలిచాడు. వాడికి పిల్లి పిల్లలంటే ప్రాణం. ఆమె కూడా వచ్చింది. "చచ్చాంరా భగవంతుడా! ఇక ఇంట్లో పిల్లుల పురుడూ పోయాలేమో," గుండె బాదుకుంది. ఆమెకీ అది ఉంది కదా. కుటుంబ రావు నవ్వబోయి, గాంభీర్యాన్ని మొహమంతా పులుముకున్నాడు. "చాలు నటన. నవ్వండి, ఆపుకోవటం ఎందుకు?" ఇంట్లోకి పోతూ అనింది. అతను నవ్వేడు.

పెద్దపిల్లి వారం రోజులు మెట్ల క్రింది స్థలాన్ని పురిటి గదిగా వాడుకుంది. పిల్లి పిల్లలు గునగున తిరుగుతూ ఊలు బంతులు తిరుగుతున్న ట్లున్నాయి. పిల్లలకు, రావుకు ముచ్చటగా ఉంది. పిల్లలు పిల్లులకు ప్లేటుతో పాలు పెడుతుంటే చూడనట్లు ఊరుకుంటోంది ఇల్లాలు. అపుడపుడు పిల్లల మీద, పిల్లుల మీద విసుక్కుంటుంది.

ఈ రోజు రెండు పిల్లి పిల్లలు గేటు కంత నించి రోడ్డు చూడటానికి వెళ్లాయి. తిండి కోసం కాచుకు కూర్చున్న కుక్క వాటిని పట్టి పీకి చంపేసింది. చచ్చిన పిల్లులని వదిలేసి అన్నం కోసం హాల్లో గడియారం కేసి చూస్తూ గేటు ముందు కూర్చుంది. కోపం కొద్దీ ఆ రోజు ఇంటి వాళ్లు కుక్కకు తిండి పెట్టలేదు. చూసి చూసి, తను చేసిన తప్పిదం తనకు తెలీక - నా జాతి నైజానికి వ్యతిరేకంగా ఏం చేశానా అనుకుంటూ వెళ్లిపోయింది.

రెండుమూడు రోజుల తర్వాత మరో పిల్లి పిల్ల మరో కుక్కకు బలైంది. మిగిలిన పిల్లను రక్షణకు డాబా మీదకి చేర్చారు. అది బొద్దుగా, దూది బొమ్మలా ఉంది. పులి కుటుంబానికి చెందినా - తెల్లగా శాంతి దూతలా, హింసను అహింసతో సంహరింబోయే కారణ జన్మురాలిలా అనిపించేది. ప్రేమతో పోసిన తెల్లటి పాలు త్రాగి పెరిగింది. ఇల్లు వదలేసింది. తనను తాను రక్షించుకోగలదు. ఎప్పుడన్నా చుట్టపు చూపుగా వస్తుంది. అహింస అంటే నాకూ ప్రేమ ఉంది, కానీ నా నైజాన్ని జయించలేకుండా ఉన్నా అని తెలియజేస్తున్నట్లు ఒకటీ అరా ఎలుకల్ని సంహరిస్తుంది. ఆ విధంగా ఆ ఇంటివారి ఋణం తీర్చుకుంటోంది.

పిల్లి పెంపకం అయింది. మరో పెంపకం ఇలా ఆరంభమయింది.

"ప్రొద్దున్నే మొహం కడుక్కోకుండా ఏం చేస్తున్నట్లు." కేకేశాడు తండ్రి.

"నాన్నగారూ! రండి రండి ఒక్కసారి," పిల్లలు బదులు పలికారు.

ఏం కొంప మునుగిందోనని పెరటి వైపు నించి ఇల్లాలు పరుగెత్తుకొచ్చింది. మెట్ల దగ్గర మూగి ఉన్నారు నలుగురూ.

"అబ్బా, నాకు ఒళ్లు జలదరిస్తోంది వాటిని చూస్తే," అన్నది అమ్మాయి.

"పుట్టిన మొదటి క్షణాల్లో నిన్ను చూసినపుడు అలాగే అనిపించింది," తండ్రి.

"కన్న కూతురు ఉడత పిల్లా ఒకేలాంటి భావం కలిగించగలవన్నమాట మీలో" కామేశ్వరి.

మాట మారుస్తూ "అటక మీద పెట్టకుండా ఇక్కడ కనిందేమిటిరా ఉడత?" అడిగాడు, ఉడత అన్ని పనులూ పిల్లలతో సంప్రదించి చేస్తున్నట్లు.

"ఈ మధ్య అటక మీద కాపురం మానేసింది. కరెంటు మీటరు అరలోకి మార్చింది. అక్కడికి చెత్త చేరుస్తోంది."

"పడక గదిలో వాళ్లకు అసౌకర్యంగా ఉంటుందని మకాం మార్చింది" కామేశ్వరి నవ్వింది.

ఇంకా కళ్లు తెరవని మూడు ఉడత పిల్లలు. ఒకదానిలో ఒకటి భయంభయంగా ఒదిగి ఉన్నాయి.

"రండి పోదాం. మనం ఉంటే పాలివ్వటానికి తల్లిరాదు."

మూడు రోజులు గడిచాయి. వర్షం పడుతోంది. మెట్ల క్రింద జల్లు కొడుతుందని మూడు పిల్లల్ని ప్లాస్టిక్ ప్లేటులోకి చేర్చి, హాల్లో నిలువెత్తు కిటికీ దగ్గరగా, కరెంటు మీటరు అలమర కిందికి చేర్చారు. ఆ రోజు తల్లి రాలేదు. అవి ఇంకా కళ్లు తెరవలేదు. వాటిని చూస్తే ఒళ్లు జలదరిస్తుంది. జాలి కలుగుతుంది. పెట్టిన పాలను తాగుతున్నాయో లేదో తెలీదు.

మరుసటి రోజు ప్రొద్దున కామేశ్వరి కళ్లు నలుముకుంటూ హాలుతలుపు తీసింది. తెల్ల పిల్లి ఆమెను దాటుకుని బయటికి ఉరికింది. ఎప్పటి నుంచి అది హాల్లో దాగిఉందో తెలీదు. దాని నోట్లో ఒక ఉడత పిల్ల ఉంది. ఆమె అరచి దాన్ని విడిపించే ప్రయత్నం చేయటానికి లేదు. ఆఫ్రికా అడవిలో లేడిపిల్లను నోటితో కరిచిపట్టుకుని పారిపోయే పులి వేగంతో దూకి వెళ్లిపోయింది పిల్లి. హాలు మూల మరొక ఉడత పిల్ల తోక మాత్రం మిగిలి ఉంది. మూడింటినీ పొట్టన బెట్టుకుందా? వెళ్లి వెదికింది. కార్పెట్ మడతల్లో ఒక పిల్ల ఒదిగి ఉంది.

'పెద్దబాబూ, నేను చెబితే ఏదీ వినరు. చూడండి, పొద్దునే జీవహింస చూడాల్సి వచ్చింది.'

పిల్లలు ముగ్గురూ పరిగెత్తుకొచ్చారు. చంటాడు ఏడుపు లంకించుకున్నాడు. ఇంటాయన కళ్లు నలుముకుంటూ వాళ్లని చేరాడు. తండ్రిని చూసి కుర్రాడు ఆరునొక్క రాగపు శ్రుతిని పెంచాడు. తల్లి గదిమింది. తండ్రి ఊరుకోబెట్టబోయాడు. -

"పోనీలే, ఒక ఉడత పిల్ల మిగిలింది కదా. పోయిన వాటి గురించి బాధపడకూడదు."

"బాగా చెప్పారు."

" పిల్లని జాగ్రత్తగా కనిపెట్టి, పాలు పోసి పెంచండి," ఆమెకు సరైన సమాధానం ఇదే అన్నట్లు

పిల్లతో అన్నాడు.

తల్లి ఉడత ఫికర్ లేదు. కనగానే, వాటిని సృష్టించిన వాడిదే వాటి బాధ్యత అని తెలుసుకున్న జ్ఞాని అయిఉండాలి. ప్రేమతో పాలు పోసి పెంచి, కుక్కల బారి నుంచి ఆ కుటంబం రక్షించిన శాంతి రంగు పిల్లి సాయంత్రం తిరిగి ఉడత పిల్లకు అడుగు దూరానికి వచ్చింది, కిటికీలోనించి దూరి. ఇల్లాలు పూలు మాలగా గుచ్చుతూ వచ్చి చూసి, శక్తినంతా కూడగట్టుకుని అరిచింది. అడుగు దూరపు ఉడత మృత్యువు వచ్చిన దారినే పారి పోయింది. ఆమె కిటికీ మూసేసింది. సాయంత్రం పిల్లలు రాంగానే ఆఖరి కూన చావబోయిన సంగతి వాళ్లతో చెప్పింది. ఆఖరివాడు ఏడవబోయి ఆగిపోయాడు. ఎలా అయితేనేం ఆ జీవి బ్రతికే ఉంది అన్న విషయం గుర్తొచ్చి. పిల్లలు, తండ్రి సాధ్యమయినంతవరకు తలుపులు, కిటికీ రెక్కలు మూసే ఉంచుదామని నిశ్చయించారు. "ఇల్లు అష్టదిగ్బంధనం చేస్తే ఆ కూన సంగతేమోకాని, ఎండల వేడికి నేను టపా కట్టటం ఖాయం" అంది కామేశ్వరి.

కూన ఇంకా కళ్లు తెరవలేదు. దాన్ని కరెంటు మీటరు అలమరలోకి ఎక్కించారు. ప్లేట్లో పాలు పోసి పెడుతున్నారు. అలికిడయితే పాలు గోడకు అంటుకుపోతోంది. ఆకలి కన్నా భయం దాన్ని ఎక్కువ బాధిస్తున్నట్లుంది. తల్లి లేకపోయిన, మరోతోడులేకపోయినా, తిండిలేక పోయినా - చావు భయం, బ్రతకాలన్న తాపత్రయం. పోసేపాల చుక్కలు ఘనీభవిస్తున్నాయి. తాగుతున్నదా లేదా? "పాలలో మూతి ఉంచుతున్నది అప్పుడప్పుడు," అన్నాడు చంటాడు. ఈ చిన్న విషయమూ ఒక రహస్యం. అదీ పెరుమాళ్లకే తెలియాలి. అప్పు డప్పుడూ అరుస్తోంది భగవంతుడిని ప్రశ్నిస్తోందా, తల్లిని పిలుస్తోందా? పెరు....

"చూశారా ఆ అల్పజీవి ఒంటరి పోరాటం?" రావు. నిజానికి అది పోరాటమా, "వెల్లువలో పూచిక పుల్లలా" కొట్టుక పోవటమా?

నాలుగు రోజులూ దాని అరుపులు, దాని ఉనికిని గుర్తు చేస్తున్నట్లు వినిపిస్తూనే ఉన్నాయి. కంఠం క్షీణిస్తోంది, క్రమక్రమంగా, శరీరం ఆకలి, భయం వేడికి కొవ్వొత్తిలా కరిగి హరించిపోతోంది. పోసిన పాలు తాగుతున్నది అని ఇద్దరి అభిప్రాయం. ముట్టుకోవటం లేదని కొందరి అభిప్రాయం. భయం వల్ల తాగటం(నాకటం) లేదా, ఈ పాలు నచ్చకనా? పాల విషయమేమోగాని, కాలకృత్యాల విషయంలో సందేహం లేదు. అలమర కంపుకొడుతోంది.

అయిదో రోజు అరుపు వినబడలేదు. అలమర




తలుపు తీసి చూశారంతా. కదలిక లేదు. చప్పుడు చేసినా. జయించిందా భయాన్ని? కాదు - వదిలేసింది ప్రాణాన్ని. ఆకలే ఆకలినించి, భయాన్నించి ముక్తిని ప్రసాదించి ఉంటుంది.

"ఈ నాలుగు రోజులూ అది పాలు త్రాగి ఉండదు. త్రాగి ఉంటే అంతలా క్షీణించి పోదు, అంత త్వరగా చావనూ చావదు," అమ్మాయి అభిప్రాయపడింది.

"పిల్లి దీన్ని ఎత్తుకుపోయి ఉంటే అయిదు రోజుల నరకయాతన తప్పి ఉండేది," కామేశ్వరి.

చంటాడు ఏడుపు మొహం వేశాడు.

న్యాయస్థానపు బోనులో నిలబడినట్లుంది రావుకి. లోపలకి తెప్పించి రక్షణ కల్పించి చావునుంచి ఎలాగూ దాన్ని తప్పించలేకపోయాడు - నరకయాతనకూ దాన్ని గురిచేశాడా? పిల్లి దాన్ని చంపటమే నయం అన్న జ్ఞానం ముందుగా కలిగింది అనుకుందాం. అప్పుడు - ఉడత పిల్ల పిల్లివాత పడినపుడు చూస్తూ ఊరుకున్నా, అపరాధభావం తనలో కలగకుండా ఉండేదా? ఈ రెండింటిలో ఏది తీసుకోదగిన చర్య?

గజ్జికుక్కకు అన్నం వేస్తూరావటం వలన ఇల్లు మరిగింది. అలా కాకుండా ఉంటే మొదటి రెండు పిల్లి పిల్లలు (మరో కుక్కపాలు కాకుంటే) బ్రతికి ఉండేవి. నోరు లేని కుక్క ఆ హింసకు పాల్పడుతుందన్న కాలజ్ఞానం కలిగి ఉంటే అప్పుడు పిడికెడు మెతుకులు దాని ముందు వేయకుండా ఉండటం సరైన పనేనా?

మిగిలిన ఒక్క పిల్లి పిల్లను కుక్కలబారినించి రక్షించి, పాలుపోసి పెంచకుండా ఉంటే, తదుపరి పుట్టిన ఉడత పిల్లలను అది నోటకరుచుకుని పోయే అవకాశం ఉండేదికాదు. అలాగని, చూస్తూ పిల్లిపిల్లను కుక్కలకు అప్పగించగలడా?

చంటాడు ఏడుస్తున్నాడు - కుక్క పిల్లిపిల్లల్ని చంపినప్పటిలాగే, పిల్లి ఉడుత పిల్లలని చంపినప్పటి లాగే - ఆ కుటుంబం రక్షించగా దిక్కులేక, ఆకలీ, భయాలతో కళ్లుకూడా తెరవకుండా చచ్చిన ఉడతకూన గురించి.

ఈ బిక్కచిక్కిన ప్రాణరహిత పదార్థాన్ని పెద్దవాడు పుల్లతో కాగితం మీదకి ఎక్కిస్తున్నాడు - రాగద్వేషాలకు అతీతుడిలా, గంభీరంగా.

ఇది ఇంతటి మీమాంసకు అర్హమైన విషయ మేనా?

అసలు, ఈ జీవాల విషయంలోగాని, మరో జీవిత సందర్భంలోగాని మనిషికి సరైన, నిజమైన ప్రత్యామ్నాయం ఉందా?

**(టాల్‌స్టాయ్‌కి అంకితం)**

